క్లుప్తంగా

ప్రజల సమస్యలను తెలుసుకున్న ఆర్డీఓ



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఆర్డీఓ భానుశ్రీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఎర్రగుడిపల్లెలో నగరోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్డీఓ భానుశ్రీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటికి వెళుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేశారు. కొన్ని సమస్యలను ఆమె స్వయంగా నోట్ చేసుకుంటూ పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ మలుపులు ప్రమాదాలకు పిలుపులు



ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు మలుపు

సింహాద్రిపురం : సింహాద్రిపురం నుంచి వెలిదండ్ల రోడ్డులో సింహాద్రిపురానికి అతి చేరువలో ఉన్న రోడ్డు మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. ఈ రోడ్డు మలుపుతో ఎన్నో ప్రమాదాలు జరిగి ఎంతోమందికి కాళ్లు, చేతులు విరిగిన సంఘటనలతోపాటు ప్రాణాలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. ఈ రోడ్డులో ఉన్న మలుపులను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా రైతుల భూములు కొనుగోలు చేయడానికి గత ప్రభుత్వం జమ్మలమడుగు ఆర్డీఓ రైతులతో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రోడ్డు మలుపు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ : దసరా నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రీచౌడేశ్వరి దేవాలయంలోని అమ్మవారిని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుమలదాసు, సభ్యులు ఆయనకు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, కౌన్సిలర్ ముల్లా జానీ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట.. ధరల మంట

- మండుతున్న కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు
- అవస్థలు పడుతున్న సామాన్య ప్రజానీకం



సింహాద్రిపురంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న నిత్యావసర సరుకులు

సింహాద్రిపురం : పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారుతోంది. రోజురోజుకూ కూరగాయలు, నిత్యావసర ధరలు పెరుగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి దసరా పండుగ సందర్భంగా నిత్యావసర వస్తువుల ధరలను చూసి మధ్యతరగతి, సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రెండు నెలల నుంచి మార్కెట్లలో సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సన్ ఫ్లవర్ ఆయిల్, పామాయిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అదేవిధంగా పామాయిల్, కొబ్బరి, వెల్లుల్లి ధరలు దాదాపుగా రెట్టింపు కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సన్ ఫ్లవర్ ఆయిల్ 15 లీటర్ల క్యాను రెండు నెలల క్రితం రూ.1600 ఉండగా.. ప్రస్తుతం రూ.2,000లకుపైనే పలుకుతోంది. దీంతో కొనలేం.. తినలేమంటూ సామాన్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కిరాణ దుకాణాలు వెలవెల

పండుగ వేళ ప్రజల కొనుగోళ్లతో కిటకిటలాడాల్సిన కిరాణ దుకాణాలు వెలవెలబోతున్నాయి. హోల్‌సేల్‌తోపాటు రిటైల్ షాపుల నిర్వాహకులు సైతం వ్యాపారాలు లేక ఖాళీ కూర్చున్నారు. ఎవరైనా వచ్చినా అరకొర సరుకులు తీసుకెళ్తున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో ఉన్నంతలో అరకొర కొనుగోలు చేసి ప్రజలు సర్దుకుంటున్నారు.

మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు, చక్కెర, కంది బేడలు పంపిణీ చేసేది. నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరఫరా అయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వం కార్డుదారులకు ప్రభుత్వం కంది బేడలను ఇవ్వకుండా కేవలం చక్కెర, బియ్యంతో సరిపెడుతోంది.

సగానికి పైగా వ్యాపారాలు పడిపోయాయి



పండుగ వేళ జోరుగా ఉండాల్సిన వ్యాపారాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. పెరిగిన రేట్లతో చాలామంది ప్రజలు కిలో తీసుకునే చోట.. అరకిలో తీసుకుని సరిపెడుతున్నారు. గతంలో ఎప్పుడు కూడా ఇంత అధ్వానంగా వ్యాపారాలు జరిగింది లేదు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సరుకులు తెప్పిస్తే వ్యాపారాలులేని పరిస్థితి నెలకొంది. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

\- కిశోర్‌రెడ్డి, కిరాణా షాపు యజమాని, సింహాద్రిపురం

ఏమి కొనలేని పరిస్థితి



నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెరిగిన ధరలతో మార్కెట్‌లో ఏమి కొనలేని పరిస్థితి. మొన్నటి వరకు కూరగాయల ధరలతో ఇబ్బందులు పడితే ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. పండుగ పూట ఏది కొందామన్న ధరలను చూసి గుండెదడ వస్తోంది. ఇలాగైతే మాలాంటి మధ్యతరగతి ప్రజలు ఎలా జీవించాలి.

\- రామాంజనేయులు, స్థానికుడు, సింహాద్రిపురం

అక్రమంగా ఇసుక నిల్వ



గూడెంచెరువు టిడ్కో ఇళ్ల వద్ద డంపింగ్ చేసి ఉన్న ఇసుక

జమ్మలమడుగు రూరల్ : పెన్నానది పరివాహక ప్రదేశం అయిన గూడెంచెరువు గ్రామంలో టిడ్కో ఇళ్ల సమీపంలో కొందరు ఇసుకాసురులు ఇసుక డంప్ ఏర్పాటు చేసుకున్నారు. గత కొంత కాలం నుంచి డంపింగ్ చేసిన ఇసుకను లారీల ద్వారా ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుకను గ్రామం వెలుపల అక్కడక్కడా డంపింగ్ చేసుకుని ఈ తంతు నిర్వహిస్తున్నట్లు సమాచారం. జమ్మలమడుగు మండలంలో ఇసుక రీచ్ లేకపోవడంతో కొండాపురం మండలం ఇసుక రీచ్ నుంచి లారీల ద్వారా కొనుగోలు చేసుకుని తీసుకువస్తున్నారు. దీంతో జమ్మలమడుగు సమీపంలో పెన్నానది ఉండటంతో ఇసుకాసురులకు పంట పండినట్లయింది. రాత్రి సమయాల్లో కొందరు రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇచ్చి తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా జేసీబీల ద్వారా కొండ పగులగొట్టి గ్రావెల్, సుద్దను తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులను నిర్వహించాలి



ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్, తదితరులు

లింగాల : మండలంలోని బోనాల గ్రామంలో గురువారం గ్రామోదయం కార్యక్రమాన్ని మండల స్పెషలాఫీసర్ మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, హౌసింగ్ ఏఈ రామసూరారెడ్డి, పీఆర్ ఏఈ మనోహర్‌రెడ్డిలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని హౌసింగ్ కాలనీ, ఎస్సీ కాలనీ, గ్రామంలోని వీధి దీపాలు, అంగన్‌వాడీ కేంద్రాలను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును తూకం వేశారు. గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహార కిట్లపై ఆరా తీశారు. హౌసింగ్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులతో చర్చించారు. అదేవిధంగా చెత్త నుంచి సంపద యూనిట్లను పునరుద్ధరించాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండలస్థాయి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం



దేవరాజుపల్లె ఎస్సీ కాలనీలో వసతులపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

కమలాపురం : ప్రతి గ్రామంలో మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దేవరాజుపల్లెలో జరిగిన గ్రామాభ్యుదయంలో భాగంగా మండల స్పెషలాఫీసర్, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ వెంకట సుబ్బారెడ్డితో కలసి ఆయన దేవరాజుపల్లె ఎస్సీ కాలనీలో పర్యటించారు. కాలనీలోని మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అలాగే చెత్త నుంచి సంపద తయారు చేస్తామన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రజలకు మంచి పౌష్టికాహారం అందించి రక్త హీనతను నివారిస్తామన్నారు. స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో అన్ని గ్రామాల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కెజియా, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రతాప్‌రెడ్డి, రాజేష్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుబ్బమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడండి



రక్తదానం చేస్తున్న మాజీ జెడ్పీటీసీ షబ్బీర్‌వల్లితో సర్పంచ్ శ్రీనివాసులు

వేంపల్లె : రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ షబ్బీర్‌వలిలు తెలిపారు. గురువారం స్థానిక ఆర్ఎంఎస్ వీధిలో బోగా పార్వతమ్మ బ్లడ్ సెంటర్ సహకారంతో ఎంజీ గ్రీన్ బ్యూటీ టెండర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు రక్తదానం చేసిన యువతకు పండ్లు, జ్యూస్, సర్టిఫికెట్లను అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ రక్తదానం శిబిరాలను ఏర్పాటు చేయడంవల్ల బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు.

రక్తదానం చేసేందుకు వేంపల్లెలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది కూడా స్వచ్ఛందంగా రావడం సంతోషకరమన్నారు. గర్భిణులకు, బాలింతలకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం చాలా అవసరం ఉంటుందని.. అలాంటి వారికి ఆపన్న హస్తం ఇచ్చేందుకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో రక్తదాన శిబిరం నిర్వాహకుడు మదర్షావలి, సమీర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ శిరిగిరెడ్డి అంకిరెడ్డి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ ఆర్‌జేడీని నియమించాలి

కడప ఎడ్యుకేషన్ : బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రాయలసీమ ప్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్ పోస్టుకు రెగ్యులర్ అధికారిని నియమించాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. కడపలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లకు పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా ఉంటున్న రవి ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను శాసిస్తున్నారన్నారు. ప్రిన్సిపల్‌గా ఉంటూ ఇన్‌ఛార్జి డీవీఈఓ, ఆర్ఐఓ, ఆర్‌జేడీ పదవుల్లో కొనసాగారన్నారు.

తుక్కు రేగ్గొడతాం అని మాట్లాడటం గాంధీ సిద్ధాంతమా



మాట్లాడుతున్న ఉప్పలపాడు యోబు

జమ్మలమడుగు రూరల్ : తుక్కు రేగ్గొడతాం, దుమ్ము రేగొడతాం అని రెచ్చగొట్టె విధంగా ఎన్‌డీఏ నాయకులు గొన పురుషోత్తంరెడ్డి మాట్లాడటం మహాత్మగాంధీ సిద్ధాంతమా అని రాష్ట్ర వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఉప్పలపాడు యోబు ఆయనను సూటిగా ప్రశ్నించారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎన్‌డీఏ నాయకులు పొన్నపురెడ్డి కుటుంబాన్ని విమర్శించే హక్కు వారికి లేదన్నారు. ఎన్‌డీఏ నాయకులు ప్రజలు చూసెందుకు పైకి మాత్రం ఫ్యాషన్ అంటూ లోపల మాత్రం ఫ్యాక్షన్ కు అజ్యం పోస్తున్నారని ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి హయంలో జమ్మలమడుగును అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గుండ్లకుంట గ్రామంలో గురుకుల పాఠశాల దేవాలయంలో పెట్టి పొన్నపురెడ్డి కుటుంబీకులు బాడుగలు వసూలు చేయడం జరిగిందని ఎన్‌డీఏ నాయకులు చెప్పడం వారి అవివేకం అన్నారు. పాఠశాల నిర్మాణం కొరకు 10 ఏకరాల స్థలాన్ని ఉచితంగా పొన్నపురెడ్డి కుటుంబీకులు ఇచ్చారన్న సంగతి అందరికి తెలిసిన విషయం అని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొమ్ము నరసింహులు, శంతన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించడంలో ప్రభుత్వం విఫలం



శ్రీరంగనాథస్వామి సంత మార్కెట్‌లో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆర్డీఓ భానుశ్రీకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలను వెంటనే నియంత్రణ చేయాలి
- మార్కెట్ యార్డులో సబ్సిడీతో కూరగాయలు ఇవ్వాలి
- వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన

పులివెందుల టౌన్ : పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని, ధరలను నియంత్రణ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్పలు కోరారు. గురువారం పట్టణంలోని శ్రీరంగనాథస్వామి సంత మార్కెట్‌లో పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఏమీ కొనలేం, తినలేం అన్నట్లుగా ప్రజలు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో సామాన్య ప్రజలు ఎవరూ బ్రతకలేకపోతున్నారన్నారు. ఏమి కొనాలన్నా, ఏమి తినాలన్నా అత్యధిక ధరలతో పేద ప్రజలు ఎవరూ కూడా కొనలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న ఆర్డీఓ భానుశ్రీకి వైఎస్సార్‌సీపీ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లి కిశోర్, ఖాదర్‌బాషా, రంగనాయకులు, లక్ష్మీభార్గవి, లక్ష్మీ ప్రసన్న, సలీమా, షాహిదా, మల్లికార్జున, రాజశేఖర్, ఇమాంబి, కో ఆప్షన్ చంద్రమౌళి, వైఎస్సార్ సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, రసూల్, అంబకపల్లె నారాయణస్వామి, కోళ్ల భాస్కర్, కనక, రవి, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవం



గడ్డంవారిపల్లెలో రాజరాజేశ్వరీదేవికి బోనాలు తీసుకెలుతున్న మహిళలు

వీరపునాయునిపల్లె : దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గడ్డంవారిపల్లెలో గురువారం నిర్వహించిన బోనాల ఉత్సవం వైభవంగా సాగింది. అయ్యవారిపల్లె, గడ్డంవారిపల్లె గ్రామాల మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవం అయ్యవారిపల్లె గ్రామం నుంచి ప్రారంభమై గడ్డంవారిపల్లెలోని రామలింగేశ్వరస్వామి ఆలయం మీదుగా రాజేశ్వరీదేవి ఆలయం వరకు సాగింది. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన బోనాలను ఆలయ అర్చకులు భక్తులకు పంపిణీ చేశారు. తలపనూరు గంగమ్మ, కీర్తిపల్లె నల్లనమ్మ, ఉరుటూరు చౌడమ్మ, అనిమెల బోగాదమ్మ, సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దుష్ట సంహారిణి.. మహిషాసురమర్దిని



పులివెందుల : మహిషాసురమర్దిని అలంకారంలో అంకాలమ్మ అమ్మవారు



వేముల : దుర్గాదేవి అలంకారంలో శ్రీనల్లనమ్మ అమ్మవారు



వల్లూరు అమ్మవారి శాలలో శ్రీ మహిషాసుర మర్దిని అలంకారం



సింహాద్రిపురంలో మహిషాసురమర్దిని అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు



జమ్మలమడుగులో మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు

పులివెందుల టౌన్ : దుష్ట సంహారిణి.. మహిషాసుర మర్దిని అంటూ అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. పట్టణంలోని అమ్మవారి ఆలయాలలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త రవికుమార్ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపించారు. అంకాలమ్మ ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేంద్రప్రసాద్, ఈఓ రమణలు, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలోని గంగమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వేములలో..

వేముల : గొల్లలగూడూరు గ్రామంలోని శ్రీనల్లనమ్మ ఆలయంలో గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానిక శ్రీవాసవీ ఆర్యవైశ్య కల్యాణ భవనంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా ప్రచండ రూపం ధరించిన అమ్మవారికి కూష్మాండ బలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి ఎదుట చెక్కతో చేసిన (మహిషాన్ని) దున్నను వధించారు. శాంతి పూజలను నిర్వహించారు. మంత్ర పుష్పం అనంతరం ప్రసాదాలను పంచిపెట్టారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు దుర్గా పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక పాతూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం చౌడేశ్వరిదేవి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో గురువారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దసరా ఉత్సవాలల్లో భాగంగా ఏడో రోజు ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకారంతోపాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించడం కోసం భారీ సంఖ్యలో వచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆదేవిధంగా పట్టణంలోని ఆర్టీసి డిపో గ్యారేజిలో దసరా ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రవీన్, పెద్దిరాజు, మెకానికల్ ఇంజనీరు కంబగిరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు శ్రీ మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఘనంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం పడమట వీధిలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి శ్రీ మహిషాసురమర్దినిదేవి అలంకారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రవీంద్రనాథ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డీ, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అల్లి శ్రీరామమూర్తి, సుబ్బారెడ్డి, రామాంజనేయులు, నిత్య, పందు పాల్గొన్నారు.



రవీంద్రనాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు